# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం | 18 అక్టోబరు, 2026 | పేజీలు :08


## పేదలకు ప్రజాప్రభుత్వం అండ: ఎమ్మెల్యే



వివరాలు మెయిన్‌లో...

## సరస్వతీ అలంకారంలో భద్రకాళి అమ్మవారు

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు

నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల రద్దీ...రూ. కోటితో రూపొందించిన రథం సమర్పణ





**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేశీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడవ రోజు శనివారం అమ్మవారు సరస్వతీ మాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుండే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, రథసేవ నిర్వహించారు. సరస్వతీ మాత అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటే సకల విద్యలు సిద్ధిస్తాయని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట వరంగల్ పశ్చిమ ఎంఎల్‌ఎ నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, డిసిసి అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు. ఆలయ ఈవో రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు పూర్ణ కుంభం, మంగళవాయిద్యాలతో వారికి స్వాగతం పలికారు. పూజల అనంతరం మహా మండపంలో ఆశీర్వచనం నిర్వహించి, అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. ఎంఎల్‌ఎ నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, వారి బంధుమిత్రులు సుమారు రూ.1కోటి వ్యయంతో 27 అడుగుల ఎత్తులో రూపొందించిన నూతన రథాన్ని మంత్రి శ్రీధర్‌బాబు సమ

క్షంలో ఆలయానికి సమర్పించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథ సేవలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆదివారం భద్రకాళి అమ్మవారి జన్మోత్సవం, దుర్గాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. బతుకమ్మ పండగకు కూడా ఈ రోజుతో ప్రత్యేక అనుబంధం ఉందని, తరతరాలుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారని ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు, మాజీ ధర్మకర్తలు పాల్గొన్నారు. మాజీ ఎంఎల్‌సి జోగినపల్లి సంతోష్‌కుమార్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ దాస్యం వినయ్‌భాస్కర్, నాగుర్ల వెంకటేశ్వర్లు, కె వాసుదేవరెడ్డి, తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## సబ్బండ వర్గాల ఐక్యతే
# బతుకమ్మ పండుగ

సుప్రసిద్ధ చిత్రకారుడు రుస్తుం




**ప్రజాపక్షం/ సిద్దిపేట :** తెలంగాణ అస్తిత్వం ప్రపంచంలోనే ప్రత్యేకతను సంతరించుకున్న ప్రకృతి పరువం బతుకమ్మ పండుగ ఫ్లవర్ ఫెస్టివల్ పండుగను పురస్కరించుకుని నేడు రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో కలసిమెలసి బతుకమ్మ చిత్రాన్ని సుప్రసిద్ధ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. పండుగలు సమాజాలను కళావంతం చేస్తాయని, సద్దుల బతుకమ్మ పండుగ బంగారు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ఆడపడుచుల ఆట పాటలతో సబ్బండ వర్ణాల ఐకమత్యాన్ని సహజీవన సౌందర్యాన్ని పెంపొందించి ప్రకృతి కి పెద్దపీట వేస్తుంది, రంగు రంగుల పువ్వల్లే కలసిమెలసి బతుకమ్మ, బతుకమ్మ మనబతుకు బతుకమ్మా, మన తెలంగాణ అస్తిత్వం బతుకమ్మ. ఫ్లవర్ ఫెస్టువల్ అన్నార్తుల బాధలను అధిగమించాలని, నిరుద్యోగ, అణచివేత బాధితుల బాధలు తొలగాలని, దేశ నలుమూలల శాంతిని సంతోషాలను సహజీవనాన్ని ఇకమత్యాన్ని కోరుకుంటుందని కలర్ఫుల్ బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వం, మన ముఖ్యమంత్రి ఆడపడుచులకు బతుకమ్మ పండుగ కానుకగా చీరెలు ఇవ్వాలని యావత్ ప్రపంచం ఎదురుచూస్తున్నదని, ప్రఖ్యాత మానవతా చిత్రకారులు రుస్తుం తెలియజేశారు. ఆర్ ఎ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం నైరూప్య చిత్రకారులు నహీం రుస్తుం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రుబినారుస్తుం, రహీమ్, కొండ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## టిజిఎన్‌పిడిసిఎల్‌కు 14వ ఇన్నోవేషన్ విత్ ఇంపాక్ట్ అవార్డు



వివరాలు మెయిన్‌లో...



## ఐదో రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎంజెఎసి సమ్మె

భిక్షాటనతో నిరసన... నిలిచిపోయిన వైద్య సేవలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో ఎన్‌హెచ్‌ఎం జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె భిక్షాటన చేస్తూ ఐదో రోజుకు చేరుకుంది.ఈ సమ్మె కారణంగా జిల్లాలోని పలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా చిన్నపిల్లలకు వేయాల్సిన టీకాల కార్యక్రమాలు, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సిహెచ్ సి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలోని చిన్న పిల్లల వేసే టీకాలు, ఒపీ సేవలు ఆరోగ్య సేవలు ప్రభావితమయ్యాయని జెఎసి ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, వైద్య సేవలు యథావిధిగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని జెఎసి నాయకులు కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే వరకు తమ న్యాయపోరాటం కొనసాగుతుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎన్‌హెచ్‌ఎం జెఎసి ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో చేసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా జిల్లా అధ్యక్షుడు బడితల రమేష్, సెక్రెటరీ మధు బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్ డా॥ రఘురాం, కోఆర్డినేటర్ ప్రవీణ్, డా॥ జగదీశ్, అడ్వైజర్స్ శ్రీనివాస్, ప్రభాకర్, డా॥ విజయ్, ఏఎన్‌ఎమ్‌లు వెంకటమ్మ, శ్రీలత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యాన్ని సాధించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం / మెదక్ :** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యాన్నీ సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నుంచి గృహనిర్మాణ శాఖా అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యాన్ని సాధించాలని, ఇప్పటివరకు మొదలు పెట్టని మొదటి విడత, రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు మొదలు పెట్టని ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ను గుర్తించి వారికి ప్రేరణ కల్పించాలన్నారు. ఈ గూగుల్ మీట్ లో పిడి హౌసింగ్ మాణిక్యం, హౌసింగ్ ఏఈ, డిఈ లు పాల్గొన్నారు.

## ప్రజలందరూ చెడుకు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/కమలాపూర్:** ప్రజలందరూ చెడు మార్గాన ప్రయాణించకుండా ధర్మం వైపు నడుస్తూ అభివృద్ధి చెందాలని, ఆ దుర్గామాత ధర్మం వైపు నడుస్తూ అభివృద్ధి చెందాలని, ఆ దుర్గామాత దీవెనలు ప్రజలందరికి ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు కమలాపూర్ సిఐ నవీన్ అన్నారు. కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెం శ్రీ సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహా అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధు, శ్రీ సిద్ధి వినాయక యూత్ కమిటీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సంతోష్ శాస్త్రికి విజయ ప్రతిభ పురస్కారం

**ప్రజాపక్షం / వేలేరు :** హనుమకొండ జిల్లా వేలేరు మండలకేంద్రానికి చెందిన చౌదరి మఠం సంతోష్ శాస్త్రి శుక్రవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో కళానిలయం సాంస్కృతిక సేవాసంస్థ నవరాత్రి సంగీత నాట్యవైభవం ఇరుముడి చిత్ర బృందం ప్రతినిధులు ఎ పుష్పలత సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ ప్రతిభ పురస్కారంకు ఎంపిక కాగా ఈపురస్కారాన్ని నిర్వహకుల చేతులమీదుగా అవార్డును స్వీకరించారు.వేదసాంప్రదాయాల పరిరక్షణ,ఆధ్యాత్మిక సేవల్లో ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా విజయ ప్రతిభ పురస్కారం అందించడం పట్ల స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తన సేవలను గుర్తించి పురస్కారం అందించిన కాలానిలయం సంస్థ ప్రతినిధులు ఎపుష్పలత,సురేందర్లకు చౌదరి మఠం సంతోష్ శాస్త్రి కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులోనూ వేదసాంప్రదాయాల పరిరక్షణ ప్రజలకు ఆధ్యాత్మిక సేలందించేందకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

## 18న సద్దుల బతుకమ్మ, 20న విజయదశమి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** గ్రామ పురోహితులు, గ్రామ పెద్దల నిర్ణయం మేరకు బచ్చన్నపేట గ్రామంలో సద్దుల బతుకమ్మ, విజయ దశమి పండుగల తేదీలను ఖరారు చేసినట్లు గ్రామ సర్పంచ్ అల్వాల నర్సింగరావు తెలిపారు. ఈనెల 18న ఆదివారం సద్దుల బతుకమ్మ, 20న మంగళవారం విజయ దశమి సందర్భంగా ఈనెల 20వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు బచ్చన్నపేటలోని దుర్గమ్మ గుడి వద్ద జమ్మి పూజ నిర్వహించనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

## సీనియర్ న్యాయవాదులకు ఛాంబర్లు ఏర్పాటు

**ప్రజాపక్షం/జనగామ:** జనగామ జిల్లా బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి రాజయ్య ఆధ్వర్యంలో జిల్లా ఫోర్ట్ ఫోలియో జడ్జి జస్టిస్ ఎన్‌వి శ్రవణ్ కుమార్‌ను న్యాయవాధులు మర్యాదపూర్వకంగా కలిశారు. చంపక్ హిల్స్‌లో నూతనంగా నిర్మిస్తున్న కోర్టు భవనంలో సీనియర్ న్యాయవాధులకు ఛాంబర్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జడ్జి త్వరలో జనగామ జిల్లాలో పర్యటించి నూతన కోర్టు భవనాన్ని సందర్శిస్తానని హామీ ఇచ్చారు. జడ్జిని కలిసిన వారిలో సీనియర్ అడ్వకేట్స్ శ్రీనివాస్, శ్రీరాం శ్రీనివాస్, చంద్రరుషి, అడ్వకేట్స్ శంకర్, మల్లేష్, శ్రీహరి ఉన్నారు.

## 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'లో మొక్కలు నాటిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** హనుమకొండలోని పద్మాక్షి గుట్ట వద్ద గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ, వన సేవ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు, మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ రావు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్, శాసనమండలి సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, పచ్చదనం పెంపొందించడం వంటి అంశాలపై వారు ప్రాధాన్యతను చాటిచెప్పారు. నేటి కాలంలో పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, పచ్చని చెట్ల నరికివేత వంటి సమస్యలను అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించే బాధ్యతను కూడా స్వీకరించాలని పిలుపునిచ్చారు.గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాలకు ప్రోత్సాహం అందిస్తూ పచ్చదనం పెంపొందించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని ఈ కార్యక్రమం తెలియజేసింది. మొక్కలు నాటడం కేవలం ఒక కార్యక్రమంగా మిగిలిపోకుండా, వాటిని పెంచి పెద్దవిగా చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని నాయకులు సూచించారు.పద్మాక్షి గుట్ట వంటి చారిత్రక, ప్రకృతి సౌందర్యం కలిగిన ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రకృతి అందాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని, యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ, వన సేవ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, హరిత తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశాన్ని అందించారు.

## రాజకీయ విలువలను దిగజారుస్తున్న పాలక పార్టీలు

### ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** అవినీతి అక్రమాలతో ఇచ్చిన హామీలను విస్మరించి రాజకీయ విలువలను దిగజారుస్తూ పాలక పార్టీలు ప్రజా సమస్యలను విస్మరిస్తున్నాయని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కామ్రేడ్ ఓంకార్ చూపిన బాటలో పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఎంసిపిఐ(యు) వ్యవస్థాపకులు అమర జీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ 18వ వర్ధంతి సందర్భంగా నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి అంగడి సెంటర్‌లోని కామ్రేడ్ ఓంకార్ విగ్రహం వరకు ఎంసిపిఐ(యు) నాయకులు కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం పార్టీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తూ రాజ్యాంగం పెను ప్రమాదంలోకి నెట్టివేయబడుతున్నదని హక్కుల పోరాడితే నిర్బంధాన్ని ప్రయోగిస్తూ నియంతృత్వ పద్ధతులను అమలు చేస్తున్నారని ప్రశ్నించడమే నేరంగా చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కన్నం వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబూరావు, వంగల రాగసుధ, సింగతి మల్లికార్జున్, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు కలకోట్ల యాదగిరి, కేశెట్టి సదానందం, బుడిమే సురేందర్, గాజుల వెంకటయ్య, దామ సాంబయ్య, జన్ను రమేష్, అల్లి సాబ్, అనుమాల రమేష్, పేరబోయిన ఐలోని, గీసపాక కొమురయ్య, కర్ని సాంబయ్య,పెద్దారపు కుమారస్వామి, నాగెల్లి భాస్కర్, ఉప్పుల పద్మ, బక్కయ్య, రామన్న, రాకేష్, ఏఐసిటియు రాష్ట్ర కమిటీ సభ్యులు సిరిబొమ్మల భాస్కర్ లతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో అభివృద్ధి పేరుతో బుల్డోజర్ల పాలన

### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అంబాల చంద్రమౌళి మాదిగ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లిలో అభివృద్ధి పేరుతో బుల్డోజర్ల పాలన సాగుతోందని, రోడ్డు విస్తరణ పేరుతో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం టీఎస్ ఈయు కార్యాలయాన్ని కూల్చే ప్రయత్నాలను విరమించుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అంబాల చంద్రమౌళి మాదిగ డిమాండ్ చేశారు. శనివారం భూపాలపల్లిలోని భాతల రాజు భవన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ సెంటర్ నుంచి కృష్ణ కాలనీ వరకు అభివృద్ధి పనుల్లో భాగంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తున్నారని, అయితే రోడ్డు విస్తరణ పేరుతో కార్మిక సంఘాల కార్యాలయాలను తొలగించడం సమంజసం కాదన్నారు. టీఎస్ఈయు, బిఎంఎస్, టీబీజీకేఎస్ కార్యాలయాలు అభివృద్ధికి అడ్డంకి కావని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తన గెలుపు కోసం తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫసర్ కోదండరాం సహా పలు ప్రజా సంఘాలు కృషి చేశాయని గుర్తుచేశారు. ఈ నెల 9న ప్రొఫసర్ కోదండరాం నాయకత్వంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి కార్యాలయాల కూల్చివేతలను అడ్డుకోవాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీనిపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, కార్యాలయాన్ని కూల్చకుండా చూసేందుకు ఎమ్మెల్యేతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి, నాయకులు దోర్నాల రాజేందర్, అంతడుపుల సురేష్, చంటి, మెరుపటి అశోక్, దోర్నాల భరత్, బోనపాకల కుమార్, కొప్పుల సతీష్, కల్లపల్లి తిరుపతి, సదరం రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం/జనగామ టౌన్ / జనగామ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జనగామ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి సతీమణి నీలిమ మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వేడుకలలో పాల్గొనడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను భావితరాలకు అందించడంతోపాటు, మహిళల మధ్య ఆత్మీయతను పెంపొందించడంలో బతుకమ్మ వేడుకలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు.

## కార్యకర్తల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని గణేష్ కుంట తండా గ్రామంలో బిఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మునవత్ నర్సింహా నాయక్ బాబాయ్ మునావత్ చక్కు నాయక్, తీర్మలాయపల్లి గ్రామంలో గడ్డం అంజమ్మ, శివరామపురం గ్రామంలో కుక్కల ప్రశాంత్, బురహాన్‌పల్లి గ్రామంలో దొమ్మటి రామూర్తిలు ఇటీవల వివిధ కారణాలతో మరణించగా శనివారం బాధిత కుటుంబాలను మాజీ మంత్రి, పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తల కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్ గౌడ్, పూస మధు, తాళ్లపల్లి సంతోష్ గౌడ్, చిలువేరు సాయి, పాల్గొన్నారు.

## మంత్రి కోసం సామాన్య భక్తులను నిలిపివేయడం సరికాదు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** శ్రీ భద్రకాళి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంత్రి రాక కోసం సామాన్య భక్తులకు గంటల తరబడి నిలిపివేయడంపై బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. తాను సైతం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఉత్సవాలకు భారీగా భక్తులు తరలివస్తున్నప్పటికీ తాగునీరు, పార్కింగ్, క్యూలైన్ల నిర్వహణలో తగిన ఏర్పాట్లు లేవని వివరించారు.అధికారులు, పోలీసు యంత్రాంగం స్పందించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ హోదాలతో సంబంధం లేకుండా ప్రతి భక్తుడికి సమానంగా అమ్మవారి దర్శనం కల్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గంట రవికుమార్ కోరారు.

## మిషన్ వాత్సల్య శిశు గృహ పోస్టుల రాత పరీక్ష ప్రశాంతం

**ప్రజాపక్షం /జనగామ:** జిల్లాలో మిషన్ వాత్సల్య కింద బాలికల ప్రభుత్వ శిశుగృహంలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న ఆరు పోస్టుల భర్తికి శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆరు పోస్టులకు గాను 69 మంది ధరఖాస్తు చేసుకోగా 58 మంది పరీక్షలకు హాజరు కాగా 11 మంది గైర్హాజర్ అయ్యారు. కౌన్సిలర్ పోస్టులకు ఐదుగురు, చైల్డ్ వేల్ఫేర్ ఆఫీసర్ పోస్టుకు 15 మంది, స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్ పోస్టుకు 10 మంది, పారామెడికల్ పోస్టుకు ముగ్గురు, అటెండర్ పోస్టుకు 20 మంది, సేవిక పోస్టుకు ఐదుగురు పరీక్షలు రాశారు. అదనపు కలెక్టర్ బెన్షాలోమ్,ఉపాధి కల్పన అధికారి కుమారస్వామి పరీక్షల్ని పర్యవేక్షించారు.

## ఆర్థిక పథకాలపై ప్రత్యేక శిబిరాలు

**ప్రజాపక్షం /జనగామ:** ప్రజలకు బ్యాకింగ్, భీమా, పెన్షన్ సేవలను మరింత చేరువ చేసేందుకు అక్టోబర్ 21 నుండి డిసెంబర్ 31 వరకు జిల్లాలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రతిభ తెలిపారు. శనివారం అమె ఒక ప్రకటన చేస్తే జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, పట్టణ స్థానిక సంస్థల పరిధిలో నిర్వహించే ఈ శిబిరాల్లో బ్యాంక్ ఖాతాల ప్రారంభం, బీమా, పెన్షన్ పథకాల నమోదు కెవైసిపూర్తి, ఆదార్ అనుసందానం, నామినీ వివరాల నమోదు, డిఈఓ ఫండ్‌పై అవగాహన కల్పించనున్నారన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాని సూచించారు.

## ఏల సుందర్ పరామర్శ



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని కొత్తవాడకు చెందిన తోటకూరి హనుమంతు ప్రమాదవశాత్తు మృతిచెందడంతో ఆయన పార్థీవ దేహానికి బిఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు, సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, హనుమంతు మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నరసయ్య, కిష్టయ్య, దశరథ, రామచంద్రు, రమేష్, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ



ప్రజాపక్షం/భూపాలపల్లి : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు, విశిష్ట జీవన విధానానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతిని, పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. అలాగే చెరువులు, ఘాట్ల వద్ద బతుకమ్మ విసర్జన కార్యక్రమాలు సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ, సంబరాలను ఆనందంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## చిట్యాలలో బతుకమ్మ సెల్ఫీ పాయింట్




ప్రజాపక్షం/చిట్యాల:మన తెలంగాణ సద్దుల బతుకమ్మ సంప్రదాయానికి ప్రతీకగా సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా చిట్యాల ముఖ్య కూడలిలో చిట్యాల గ్రామ సర్పంచ్ తోటం లక్ష్మీ అంతయ్య ఆధ్వర్యంలో బతుకమ్మ సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. యువతులు, మహిళలు ఈ సెల్ఫీ పాయింట్‌ను సందర్శించి సెల్ఫీలు తీసుకుంటూ అబ్బురపరుస్తున్నారు. చిట్యాల చౌరస్తాలో ఒక ప్రత్యేకతను సంతరించుకుంటుంది. గ్రామ సర్పంచ్ పాలకవర్గాన్ని మండల ప్రజలు ప్రశంసిస్తున్నారు. సద్దుల బతుకమ్మ దసరా పండగ సందర్భంగా చిట్యాల వాడ వాడలలో హెయిర్ కాంప్రేషన్ మిషన్‌తో రోడ్లపై ఉన్న చెత్త, చెదారం, దుమ్ము, దూళి తొలగిస్తూ రోడ్లను శుభ్రం పరచడం చూసి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం కోసం ఇలాంటి నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం శభాష్ సర్పంచ్ అంటూ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తాడ్వాయి మండల కాంగ్రెస్ జంబో కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/ తాడ్వాయి: మండల కాంగ్రెస్ పార్టీ జంబో నూతన కమిటీని డిసిసి అధ్యక్షుడు పైడాకుల అశోక్ శనివారం ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా మంకిడి నరసింహాస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బత్తిని రాజు, ఉపాధ్యక్షుడిగా ఇప్ప నాగేశ్వర రావు, దయ వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా యానాల సిద్దిరెడ్డిలను ఏకగ్రీవంగా నియమించారు. కార్యదర్శులుగా ఎండీ ఖలీల్ హుస్సేన్, పల్నాటి సత్యం, సర్ప చంద్ర శేఖర్, సహాయ కార్యదర్శులుగా మంకిడి సమ్మయ్య, కొండాయ నర్సింహులు, ఈర్ప సూర్యనారాయణ, ప్రచార కార్యదర్శులుగా బెజ్జరి వెంకన్న, పాయం కోటేశ్వరరావు, సోషల్ మీడియా ఇంచార్జ్‌గా గజ్జల రాజశేఖర్ బాధ్యతలు చేపట్టారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన పైడాకు అశోక్ పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# పండగ వేళ బస్టాండ్‌లో అవస్థలు!



ప్రజాపక్షం/నెక్కొండ: తెలంగాణలో అతి పెద్ద పండుగైన బతుకమ్మ, దసరా వేళ కుటుంబ సమేతంగా సొంతూళ్లకు, బంధువుల ఇళ్లకు వెళ్లే ప్రయాణికులకు నెక్కొండ బస్టాండ్‌లో బస్సులు వెళ్లకపోవడంతో అంబేద్కర్ సెంటర్ లోనే బస్సు లేకున్న ప్రయాణికులు దినితో తీవ్రమైన ఇబ్బందులు తప్పడం లేదు. బస్టాండ్‌లో మరమ్మత్తుల పేరుతో అవసరమైన వసతులు కల్పించకపోవడం తో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పాఠశాలలకు సెలవులు రావడంతో ప్రయాణికుల రద్దీ పెరిగినా, అందుకు తగిన ఏర్పాట్లు లేకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పండగలు వస్తాయని ముందే తెలిసినా, ప్రయాణికుల అవసరాలను దృష్టి లో పెట్టుకొని పనులు పూర్తి చేయడంలో అధికారులు ఎ ందుకు జాప్యం చేస్తున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పండగల తర్వాత పావాడుడి చేసే బదులు..పండగల ముందే ఏర్పాట్లు చేయాలన్న కనీస బాధ్యత అధికారులకు లేదా? అని నిలదీస్తున్నారు. ప్రజల రాకపోకలకు కీలకమైన బస్టాండ్‌లో తక్షణమే అవసరమైన వసతులు కల్పించి, ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని సంబంధిత అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పంటల విధ్వంసాన్ని వెంటనే ఆపివేయాలి



ప్రజాపక్షం/ వరంగల్ : నాగపూర్ నుండి విజయవాడ వరకు నిర్మించ తలపెట్టిన నాలుగు లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం రైతుల పంట పొలాలను ధ్వంసం చేయడం దుర్మార్గమని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు సోమిడి శ్రీనివాస్‌లు అన్నారు. శనివారం రైతు సంఘాల నాయకులు పంట నష్టపోతున్న రైతుల భూములను సందర్శించారు. వరంగల్ నర్సంపేట ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న గీసుకొండ మండలం గంగాదేవి పల్లి శివారు రైతులకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా వారి పంటలను విధ్వంసం చేయడానికి నేషనల్ హైవే అధికారులు రెవెన్యూ అధికారులు పూనుకోవడం సరైనది కాదన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ పంటలకు అధిక డిమాండ్ ఉందని, ఎంతోకొంత ఊరట కలుగుతుందని ఆశపడే రైతుల పంటలు ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. పంట నష్ట పరిహారంగా ఎకరం పంట కు రూ. 60 నుండిరూ. 80 వేలు మాత్రమే ఇస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ రైతులకు మాత్రం పంట దిగుబడితో ఒక ఎకరానికి 1.30లక్షల వరకు డబ్బులు వస్తాయి. జిల్లా అధికారులు ఇప్పటికైనా రైతుల డిమాండ్ ను పరిశీలించాలి. ఈ ఖరీఫ్ సీజన్ పంటలు పూర్తయ్యేంతవరకు నేషనల్ హైవే అధికారులు రెవెన్యూ అధికారులు రైతుల భూములను స్వాధీనం చేసుకోవద్దని దీనిపై జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రైతుల పంటల భూములను సందర్శించిన వారిలో సోమిడి సాంబయ్య, సిర్ల రవీందర్ లతోపాటు బాధిత రైతులు పెండ్లి చిన్న మల్లారెడ్డి, పెండ్లి సరోజన, రమేష్ ,ఎరుకల రమేష్, ప్రవీణ్, విమల తదితరులున్నారు.

# 4,110 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

### 33 విడతలుగా వైద్య శిబిరాల నిర్వహణ

### ప్రజల కష్టాల్లో అండగా ఉంటా: భూక్య జంపన్న



ప్రజాపక్షం/ములుగు: పేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ములుగు నియోజకవర్గంలో భూక్య జంపన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 33 విడతలుగా శిబిరాలు నిర్వహించి, 4110 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు ఆయన తెలిపారు. తాజాగా శిబిరంలో ఎంపికైన వారికి హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు నిర్వహించగా, శనివారం ప్రత్యేక బస్సుల ద్వారా వారిని స్వగ్రామాలకు చేర్చారు. ఈ సందర్భంగా జంపన్న లబ్ధిదారులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా పేదలు వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. రాజకీయాలంటే పదవులు, అధికారం మాత్రమే కాదని, ప్రజల కష్టాల్లో తోడుగా నిలిచి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే నిజమైన ప్రజా సేవ అని పేర్కొన్నారు. వైద్యం, విద్య, ఉపాధి రంగాల్లో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని, ప్రజల ఆశీర్వాదాలే తనకు నిజమైన బలమని అన్నారు. ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడంతో పాటు ప్రత్యేక బస్సుల ద్వారా స్వగ్రామాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేసినందుకు లబ్ధిదారులు జంపన్నకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు అండగా నిలిచి కంటి చూపు తిరిగి పొందేందుకు సహకరించిన ఆయన సేవలను మరువలేమని పేర్కొన్నారు.

# ప్రజా పోరాటాల యోధుడు ఓంకార్ 18 వ వర్ధంతి

### కేంద్ర కమిటీసభ్యుడు పానుగంటి నర్సయ్య పిలుపు




ప్రజాపక్షం/గూడూరు;ప్రజా సమస్యల పరిష్కారానికై జీవితాంతం రాజీలేని పోరాటాలు సాగించిన ప్రజానేత మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎంసీపిఐ(యు) కేంద్ర కమిటి సభ్యులు పానుగంటి నర్సయ్య పిలుపునిచ్చారు.శనివారం గూడూరు మండల కేంద్రంలో మద్దికాయల ఓంకార్ 18వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జరిగిన సభలో పానుగంటి నర్సయ్య మాట్లాడుతూ ప్రస్తుత పాలకులు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.ప్రజలపై నిర్బంధకాండను ప్రయోగిస్తూ ప్రజా సంపదను దోచుకోవడమే లక్ష్యంగా బూర్జువా పార్టీలు పాలన సాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి ప్రజలకు న్యాయమైన నిజాయితీతో కూడిన పరిపాలన అందించాలంటే వామపక్ష శక్తులన్నీ ఏకతాటిపైకి రావాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో ఎంసీపిఐ(యు) మండల కార్యదర్శి బందెల వీరస్వామి నాయకులు బానోత్ లాలు అరకాల స్వామి నాయకులుపాల్గొన్నారు.

## బాధిత కుటుంటానికి మంత్రి పరామర్శ

ప్రజాపక్షం/ తాడ్వాయి: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పిట్టల ప్రమీల ఇటీవల ప్రమాదశాత్తు విద్యుత్ షాక్ కి గురై మృతి చెందగా విషయం తెలుసున్న మంత్రి సీతక్క స్వయంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా పదివేల నగదును అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వం తరుపున కూడా ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మెన్ బొల్లు దేవేందర్, ట్రస్టు బోర్డు మాజీ చైర్మెన్ ఆరెమ్ లచ్చు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

ప్రజాపక్షం/వాజేడు:మండల పరిధిలోని పేరూరు పోలీసు స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రేఖ అశోక్‌ను శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకర్లపూడి విక్రాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై రేఖ అశోక్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలకృష్ణ, కృష్ణాపురం సర్పంచ్ విజయ్‌బాబు, ధర్మారం సర్పంచ్ కాక సుమతి తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/మంగపేట : తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశానుసారం జిల్లా పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పటేల్ సూచన మేరకు శనివారం మండల కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ముగ్గురు లబ్ధిదారులు కుంట శంకర్ జాడి నర్సింహారావు అచ్చే రాంబాబు లకు రెండు లక్షల నలభై వేల రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అవసరమైన సమయంలో పేద ప్రజలకు అండగా నిలిచి,వారికి సహాయం అందించడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పాయం అనిత యర్రంగారి సురేష్ జిల్లా నాయకులు మాసిరెడ్డి, వెంకటరెడ్డి, వెంగల బుచ్చిరెడ్డి, మండవ రామక్రిష్ణ, మైబూఖాన్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షులు హిదయతుల్ల, మండల నాయకులు ఎస్కే హుస్సేన్, చప్పిడి వెంకటేశ్వర్లు, కొమురం లక్ష్మీపతి. అన్నాల నరసింహారావు, జబ్బ అశోక్, పాయం గణేశ్, అకుతోట వెంకన్న, శ్రీపాది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు

ప్రజాపక్షం/గణపురం: గణపురం మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గణపురం గ్రామంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామ సర్పంచ్ కటుకూరి రాధిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో వేడుకలను నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేడుకలు జరిగే ప్రదేశంలో వేదిక, విద్యుత్ దీపాలంకరణ, తాగునీరు తదితర సౌకర్యాలను సిద్ధం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మను గ్రామ ప్రజలంతా కలిసిమెలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సర్పంచ్ కటుకూరి రాధిక శ్రీనివాస్ కోరారు. గ్రామ మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు.

# టెన్నిస్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

## కోర్టుల పునరుద్ధరణ, క్రీడా సామగ్రి, ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే కె ఆర్. నాగరాజు హామీ

**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లాలో టెన్నిస్ క్రీడాభివృద్ధికి అవసరమైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు హామీ ఇచ్చారు. హనుమకొండలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో నిర్వహించిన 70వ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య టెన్నిస్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ బహుమతి ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా వరంగల్ పోలీస్ కమిషనర్ కే. శ్వేత ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతూ.. హనుమకొండలోని జెఎన్‌ఎస్‌లో టెన్నిస్ క్రీడ అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన టెన్నిస్ సామగ్రి అందించడం, కోర్టులను పునరుద్ధరించడం, రాత్రి వేళల్లోనూ సాధన చేసేందుకు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయడం వంటి సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. **టెన్నిస్ అభివృద్ధికి ప్రోత్స-**



**హిస్తా : సిపి కె. శ్వేత**

ప్రత్యేక అతిథి వరంగల్ పోలీస్ కమిషనర్ కే. శ్వేత మాట్లాడుతూ.. టెన్నిస్‌ను అన్ని వర్గాల విద్యార్థులకు చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు ఈ క్రీడలో శిక్షణ పొందే అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అవసరమైన శిక్షణ, క్రీడా సామగ్రి, సాధన వసతులు అందుబాటులో ఉంటే పేద, గ్రామీణ విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు.అనంతరం అండర్17, అండర్19 బాలబాలికల విభాగాల్లో విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అండర్ 19, అండర్ 17 పాఠశాలల క్రీడా కార్యదర్శులు శ్రీధర్, వాసుదేవరావు, హనుమకొండ యువజన క్రీడా అధికారి కొత్త ప్రశాంత్, హనుమకొండ డిస్ట్రిక్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పింగిలి వెంకటేశ్వర రావు, కార్యదర్శి ఎర్రగట్టు స్వామి, ప్యాట్రన్ రవిచంద్ర, కోశాధికారి సిరికొండ సంజీవరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఆఫీసర్ క్లబ్ జాయింట్ సెక్రెటరీ కన్నా రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బరుపాటు గోపి, అబ్బర్వర్లు శ్రీనివాస్, రాజమల్లు, అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ సిబ్బందికి దసరా కానుకలు

**ప్రజాపక్షం / వేలేరు :** సద్దుల బతుకమ్మ దసరా పండుగల సంధర్బంగా వేలేరు,మల్లికుదుర్ల గ్రామపంచాయతీ సిబ్బందికి సర్పంచ్‌లు,బిల్ల యాదగిరి,జక్కుల మౌనికి సంపత్ యాదవ్ లు నూతన వస్త్రాలు పంపిణీ ఛేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపరిశుభ్రత,పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బంది అందిస్తున్న సేవలు ముఖ్యమైనవని తెలిపారు.కార్యక్రమంలో ఇరుగ్రామాల పంచాయితీ కార్యదర్శులు,ఉపసర్పంచ్‌లు,వార్డు సభ్యులు,గ్రామపంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి విద్యఫౌండేషన్ ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** విద్య ఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్టేషన్ ఘనపూర్ కు చెందిన నర్సింగ్ కోర్స్ చదువుతున్న పేద విద్యార్థిని గాదె అంజలి ఫీజు కోసం రూ. 30,000 చెక్ ను సంస్థ వ్యవస్థాపకులు బిల్ల మహేందర్, దాతలు కాసం కిషన్ రెడ్డి చేతులమీదుగా అందించారు. టీవిజ్జీవోస్ కాలనీ ఫేజ్ 2, వడ్డేపల్లిలోని సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవసలహాదారులు గురిజాల తిరుపతి రెడ్డి, కార్యదర్శి కలకోట్ల నరేందర్, రాధికానరేన్, ఉదయశ్రీ ప్రభాకర్, క స శోభారాణి, కూరపాటి రమేష్, కదుదుల సోమన్న, బిల్ల సరిత, గాదె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వంగపహడ్ పిఎసిఎస్ చైర్మన్‌గా అనిల్ రెడ్డి నియామకం

## శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ పరిధిలోని వంగపహడ్ పిఏసిఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) చైర్మన్‌గా అనిల్ రెడ్డి నియమితులైన సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజును హనుమకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనిల్ రెడ్డితో పాటు పిఏసిఎస్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. నూతనంగా చైర్మన్‌గా నియమితులైన అనిల్ రెడ్డి గారితో పాటు కమిటీ సభ్యులను ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం పిఏసిఎస్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకెఆర్ నాగరాజును శాలువాలతో సత్కరించి తమ అభిమానం, గౌరవాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ అధ్యక్షులు పుట్ట తిరుపతి, డివిజన్ ఉప అధ్యక్షులు రవీందర్, మాజీ చైర్మన్ మెరుగు రాజేష్ గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడురాజు, పిఏసిఎస్ కమిటీ సభ్యులు గండు అశోక్,ఎంజాపురి రాములు,కొండ రాజు,సముద్రాల సూర్యనారాయణ, కోరె సరోజన,మేరగుట్టి సూరయ్య,మేరుగు రాధిక,పొన్నాల రాధ,పోలాది రామ్ రెడ్డి,కన్నెబోయిన రాజు, బండి శంకరయ్య,రేమిడి సాంబ రెడ్డి, డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ వేళ అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** సద్దుల బతుకమ్మ వేడుకలకు భారీగా రద్దీ ఏర్పడే అవకాశం ఉన్నందున మహిళలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ సూచించారు. హనుమకొండ పద్మాక్షి టెంపుల్ తో పాటు వేడుకలు జరిగే అనేక ప్రాంతాలలో పాల్గొనే వారు బంగారు ఆభరణాలు, విలువైన సెల్‌ఫోన్లు, నగదు తదితర వస్తువుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.చిన్నారులతో వచ్చే తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రద్దీలో పిల్లలు తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జనం సమయంలో నీటి లోతు, ప్రవాహాన్ని గమనిస్తూ సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని, నీటిలోకి దిగి సెల్ఫీలు తీసుకోవడం, లోతైన ప్రాంతాలకు వెళ్లడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు.పోలీసులు, నిర్వాహకుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసు, వైద్య సిబ్బంది సహాయం తీసుకోవాలని నిమ్మల శ్రీనివాస్ కోరారు. అందరూ అప్రమత్తంగా ఉంటూ సద్దుల బతుకమ్మను సంతోషంగా, సురక్షితంగా జరుపుకోవాలని ,. వేడుకలు మనలో ఆనందాన్ని నింపాలి కానీ విషాధాన్ని కాదు అని సూచిస్తూ ఆదపడుచులందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.



# ఎస్‌సి, ఎస్‌టి కేసులో తప్పిదాలపై జర్నలిస్టుల ఫిర్యాదు

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** ఎస్‌సి, ఎస్‌టికేసు (ఎఫ్ ఐఆర్ నంబర్ 471/2025) విచారణలో జరిగిన తప్పిదాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతకు జర్నలిస్టులు శనివారం ఫిర్యాదుచేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 471/2025 కింద నమోదైన కేసులో తాము సాక్షులుగా ఉన్నామని జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, తోట సుధాకర్, పెండెం వేణుమాధవ్, మేరుగుల రాజేంద్రప్రసాద్ తెలిపారు. విచారణ అధికారిగా ఉన్న హనుమకొండ ఏసిపి నరసింహారావుతో పాటు ఏ ఒక్క పోలీసు అధికారి కూడా తమను విచారణకు పిలవలేదని పేర్కొన్నారు. తమ నుంచి ఎలాంటి వాంగ్మూలాలు తీసుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయంపై విచారణాధికారిగా ఉన్న సంబంధిత ఏసిపిని సంప్రదించడంతో కేసు మూసివేశామని తెలపడంతో ఖంగు తిన్నామని తెలిపారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా కేసును ఎలా మూసివేస్తారని ప్రశ్నించడంతో ఏమైనా ఉంటే కోర్టుకు వెళ్లి చూసుకోవాలని సమాధానమిచ్చారని పేర్కొన్నారు. తమను విచారించకుండానే తమ పేర్లతో వాంగ్మూలాలు ఎలా నమోదు చేశారు? వాటిని ఏ ఆధారాలతో న్యాయస్థానానికి సమర్పించారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. సంబంధిత పోలీసు రికార్డులు, వాంగ్మూలాలు,న్యాయస్థానానికి సమర్పించిన పత్రాలను పరిశీలించి, విచారణలో బాధ్యులుగా తేలిన అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. కోర్టు ద్వారా తీసుకున్న పత్రాలన్నింటినీ సిపికి అందించారు. ఫిర్యాదును, పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ శ్వేత సానుకూలంగా స్పందించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి విచారణ జరిపిస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుకు సంబంధించిన కేసులో బాధితుడు కంకనాల సంతోష్ మరో ఫిర్యాదులో తనకు జరిగిన అన్యాయంపై సీపీకి వివరించారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. సీపీని కలిసిన వారిలో జర్నలిస్ట్ వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకటరమణ, టీయూడబ్ల్యూజె హన్మకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి విష్ణువు కూరు సాయిరాం, కోశాధికారి పాడిచెట్టి విష్ణువర్ధన్,గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, టియుడబ్ల్యూజె రాష్ట్ర బాధ్యులు పి .వేణుమాధవ్, తోట సుధాకర్, బొల్ల అమర్, మేరుగుల రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచండికా దేవి అలంకరణలో అమ్మవారు



**ప్రజాపక్షం/పాలకుర్తి:** శ్రీసోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం 7వ రోజు శ్రీచండికా దేవి అలంకరణలో చండి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒలక్ష్మి ప్రసన్న, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## దేవుని మాన్యం భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండలంలోని అన్ని గ్రామాలలో గుడులు, మసీదులకు సంబంధించిన భూములకు హద్దులు ఏర్పాటుచేసి, అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని బిజెపి మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నగేష్ గౌడ్ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయ అధికారికి బిజెపి మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు వలిపాప, రమేష్, రవి, మదన్ మోహన్, రామరాజు గౌడ్, స్వప్న, సురేష్ గౌడ్, సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల ఫోరం కమిటీ నాయకులకు ఎర్రబెల్లి సన్మానం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల ఉప సర్పంచ్‌ల ఫోరం నూతన కమిటీ అధ్యక్షుడిగా గాదెపాక కిరణ్, ప్రధాన కార్యదర్శిగా లకావత్ నాగరాజు నాయక్‌లతో పాటు సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ మరింత మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోఆయాగ్రామాలఉపసర్పంచ్‌లు,నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నుల పంపిణీ



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండలంలోని ఓబులాపురం గ్రామంలో భవానీమాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ జఫర్‌గడ్ ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించి విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలబ్ ప్రతినిధి బజ్జూరి సంతోష్ కుమార్, భవానీమాత కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల పరామర్శ



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండల కేంద్రంలోని కొత్తవాడకు చెందిన తోటకూరి హనుమంతు ప్రమాదవశాత్తు శుక్రవారం మృతిచెందగా శనివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వారి ఇంటికి వెళ్లి భౌతికదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కు టుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ధర్మారెడ్డి, నాయకులు రమేష్, వెం కన్న, ప్రకాష్, యాకస్వామి, మల్లయ్య, ప్రభాకర్, సోమన్న, సం తోష్, విజయ్, సంతోష్, చింటూ, తదితరులు పాల్గొన్నారు.

# ఎక్మోతో ఊపిరితిత్తుల మార్పిడికి కొత్త ఆశలు

**ప్రజాపక్షం /హనుమకొండ టౌన్ :** తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధులతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న రోగులకు ఎక్మో విధానం ప్రాణాధారంగా నిలుస్తోందని హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ తెలిపారు.వరంగల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్న తగిన రోగులకు ఎక్మో సహాయంతో ఊపిరితిత్తుల మార్పిడి చేసే అవకాశాలు, ఈ చికిత్సలో ఆధునిక వైద్య సాంకేతికత ప్రాధాన్యత గురించి వివరించారు.చివరి దశ ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ లేదా తీవ్రమైన శ్వాసకోశ వైఫల్యం కారణంగా ఊపిరితిత్తులు శరీరానికి సరిపడా ఆక్సిజన్‌ను అందించలేని పరిస్థితుల్లో వెనోవీనస్ ఎక్మో చికిత్సను ఉపయోగించవచ్చని డాక్టర్ తపస్వి వివరించారు.ఈ విధానంలో శరీరం వెలుపల ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రం కృత్రిమ ఊపిరితిత్తుల మాదిరిగా పనిచేస్తుంది. రక్తంలో ఆక్సిజన్ స్థాయిని పెంచి, కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి, ఆ రక్తాన్ని తిరిగి శరీరంలోకి పంపిస్తుంది. దీంతో తీవ్రమైన శ్వాసకోశ వైఫల్యం ఉన్న కొంతమంది రోగులకు అవసరమైన ప్రాణాధార సహాయం అందుతుంది.ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన ఎంపిక చేసిన రోగులకు దాత ఊపిరితిత్తులు లభించే వరకు ప్రాణాధార సహాయం అందించడంలో ఎక్మో కీలక పాత్ర పోషించవచ్చని ఆమె తెలిపారు. ఈ విధానాన్ని వైద్య పరిభాషలో 'బ్రిడ్జ్ టు ట్రాన్స్‌ప్లాంట్' ఎక్మో సహాయంతో ఉన్న రోగులకు రెండు ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించడం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని డాక్టర్ తపస్వి తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం ప్రత్యేక సంరక్షణ ఊపిరితిత్తుల మార్పిడి అనంతరం రోగి కోలుకోవడానికి నిరంతర వైద్య పర్యవేక్షణ, అత్యవసర చికిత్సా సదుపాయాలు, తగిన పునరావాస కార్యక్రమాలు అవసరమని డాక్టర్ తపస్వి వివరించారు.రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఎక్మో, వెంటిలేటర్ సహాయాన్ని దశలవారీగా తగ్గిస్తూ, కొత్త ఊపిరితిత్తులతో స్వయంగా శ్వాస తీసుకునేలా వైద్య బృందం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం వైద్యుల పర్యవేక్షణలో శారీరక పునరావాస కార్యక్రమాలు నిర్వహించి, రోగులు తమ దైనందిన కార్యకలాపాలకు తిరిగి అలవాటు పడేలా సహాయం అందిస్తారని వివరించారు.సమావేశంలో యశోద హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ జీవన్, మార్కెటింగ్ మేనేజర్ పి. సంజీవ్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రమేష్‌తో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## 18న సద్దుల బతుకమ్మ...20న రావణ వధ

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** నగరంలోని ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపురి సంజయ్‌బాబు తెలిపారు. కరీమాబాద్‌లోని ఆదర్శ కళ్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న సద్దుల బతుకమ్మ, 20న రావణాసుర వధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మైసూర్ దసరా తర్వాత ఉర్సు రంగలీల మైదానంలో జరిగే దసరా వేడుకలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఏటా లక్షలాది మంది వీక్షించే ఈ వేడుకల్లో భారీ రావణాసురుడి ప్రతిమ దహనం, బాణసంచా ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. వేడుకలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర మాజీ మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో




దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షులు నాగపురి సంజయ్‌బాబు, ఉపాధ్యక్షులు గోనే రాంప్రసాద్, సంజయ్ గౌడ్, శ్రీనివాసులు, అనిల్‌కుమార్, సందీప్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, అఖిల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, ట్రెజరర్ మంద వెంకన్న గౌడ్, జాయింట్ ట్రెజరర్ వెల్దిలింగమూర్తి, ఉత్సవ కన్వీనర్ వద్నాల నరేందర్, ట్రస్టు చైర్మన్ వంగరి కోటేశ్వర్, జాయింట్ సెక్రటరీ, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన తోటి మిత్రులు



**ప్రజాపక్షం/టేకుమట్ల :** కాలం ఎంత దూరం తీసుకెళ్ళిన జీవిత ప్రయాణంలో కొన్ని స్నేహబంధాలు తోడై ఉంటాయి. అలాంటి అరుదైన స్నేహానికి నిదర్శనంగా తోటి మిత్రులు అండగా నిలిచారు. మండలం వెలిశాల జడ్పిహెచ్‌ఎస్ పాఠశాలలో 2003...04 బ్యాచ్ మిత్రుడు అచ్చే సతీష్ మరణించడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. విషాద వార్త తెలుసుకున్న తోటి మిత్రులు సతీష్ కుటుంబానికి ధైర్యం చెబుతూ బాధలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించి రూ.20వేల ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. 22 సంవత్సరాల క్రితం ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్న మిత్రులు నేడు కష్టకాలంలో ఒకరి కోసం ఒకరు నిలబడడం వారి కుటుంబ సభ్యులను భావోద్వేగానికి గురి చేసింది. స్నేహమంటే జ్ఞాపకాలు కాదు అవసరమైన సమయంలో అండగా నిలబడడమే అని ఈ సంఘటన నిరూపించింది. స్నేహితులు ఉంటే దుఃఖం సగమే అండగా నిలిచే మనుషులు ఉంటే జీవితం ధైర్యంగా ముందుకు సాగుతుందని నిరూపించారు. సతీష్ కుటుంబ సభ్యులు తమ బాధను పంచుకుంటూ ఆర్థిక సహాయం అందించిన మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు ఆకునూరి సతీష్, కన్నూరి రమేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలు తొలగించాలి...విద్యుత్ స్తంభాలు మార్చాలి

**ప్రజాపక్షం/ములుగు :** జిల్లా కేంద్రంలోని పత్తిపల్లి రోడ్డులో తోపుకుంటకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించి, రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం కోరారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ రహదారి పక్కన పెద్దయెత్తున ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో బతుకమ్మ వేడుకలకు వెళ్లే మహిళలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాకపోకలకు ఆటంకం కలిగించే ఫ్లెక్సీలను అధికారులు వెంటనే తొలగించాలని కోరారు. రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను సైతం మార్చి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత, సౌకర్యాల విషయంలో అధికారులు తక్షణమే స్పందించాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బిజెపి నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జవహర్‌లాల్, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణకర్‌రావు, అల్లె శోభన్, కోశాధికారి గంగిశెట్టి రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు, బిజేవైఎం జిల్లా అధ్యక్షుడు మాదరి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు రాయపురం అనిల్, నాయకులు కొండబోయిన వెంకటేష్, నవీన్, శ్రీధర్, రతన్‌సింగ్, రమేష్, శ్రీనివాస్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## రిషిత జ్ఞాపకార్థం కింగ్స్ జట్టుకు జెర్సీలు అందజేత

**ప్రజాపక్షం/కాటారం :** దసరా సందర్భంగా మండలంలని ప్రతాపగిరి గ్రామంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ 1 లో భాగంగా బొప్పారం కింగ్స్ జట్టుకు స్వర్గీయ రిషిత జ్ఞాపకార్థం ఆమె తల్లిదండ్రులు అంతర్గాం రవి రజిత,సోదరుడు రాహుల్ జెర్సీలను బహూకరించారు.క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు రిషిత జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిపేందుకు కుటుంబ సభ్యులు చేసిన ఈ కార్యక్రమం ప్రశంసలందుకుంది. గ్రామణ క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా యువతలో ఈక్రడాస్ఫూర్తి ఐకమత్యం పెంపొందుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊర వెకటేశ్వర్ రావు,గ్రామస్థులు బండం రాజెందర్,అంతర్గాం రమేష్,క్రీడాకారులు,నిర్వాహకులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణానికి సర్పంచ్‌శంకుస్థాపన

**ప్రజాపక్షం/తాడ్వాయి :** మండల పరిధిలోని లింగాల గ్రామపంచాయతీ కోడిశాల గ్రామంలో మంజూరైన మూడు అంతర్గత రోడ్ల పనులను లింగాల సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ ముఖ్య అతథిగా హాజరై, కొబ్బరికాయ కొట్టి పనులకు భూమి పూజ ఛే శారు. కార్యక్రమం లో ఐటీడీఏ ఏఈ రా ము, వార్డు సభ్యులు మంకిడి జగన్, మ ం కిడి నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గోన్నారు.

## కాంగ్రెస్ నేత జమ్ముల కృష్ణారెడ్డి వర్ధంతి

**ప్రజాపక్షం/గూడూరు :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ జమ్ముల కృష్ణారెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులు ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో గూడూరు సర్పంచ్ సునీత కొమ్మాలునాయక్ ఉప సర్పంచ్ చంటి స్వామి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న రాష్ట్ర జిల్లా మండల నాయకులు సతీష్, శ్రీపాల్ ,సర్పంచ్ మహేష్, పత్యం వెంకన్న, రాసమల్ల రాములు, వీరస్వామి, శ్రీనువాస్ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోలాట నృత్య పోటీలు



**ప్రజాపక్షం/కమలాపూర్:** కనకదుర్గ యూత్ అసోసియేషన్ కమలాపూర్ 11వ వార్షికోత్సవం సందర్భంగా మహిళలకు కోలాట నృత్య పోటీలు శుక్రవారం రాత్రి మండల రెవెన్యూ కార్యాలయం సమీపంలో నిర్వహించినట్లు అధ్యక్షుడు గందసిరి రాజు తెలిపారు. శ్రీ రామాంజనేయ కోలాట కళా బృందం ప్రథమ బహుమతి రూ. 2016, శ్రీ కృష్ణ కోలాట కళా బృందం ద్వితీయ బహుమతి రూ. 1016 లుగా ఎంపికైనట్లు న్యాయ నిర్ణేతలు, ప్రముఖ గాయకుడు, రచయిత, ఉపాధ్యాయుడు జక్కు కృష్ణమూర్తి గౌడ్, జడల నరసింహ స్వామి లు విజేతలను ప్రకటించారు. న్యాయ నిర్ణేతలు యూత్ సభ్యుల ఆధ్వర్యంలో విజేతలకు నగదు పారితోషకాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గ యూత్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మౌటం రాజేష్, కార్యదర్శి జంగిలి రాజేష్, సభ్యులు కొండ మొగిలి, పిట్టల రజనీకర్, మౌటం రాజ్ కుమార్, జంగిలి శ్రీరామ్, కొండ నరేష్, కొండ లక్ష్మణ్, జంగిలి రంజీత్, మౌటం కేదారి తదితరులు పాల్గొన్నారు.

## దేవి నవరాత్రి ఉత్సవాలకు రూ.20వేల విరాళం

**ప్రజాపక్షం/రాయపర్తి :** మండలంలోని కొండూరు గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రి ఉత్సవాలలో శనివారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవి నవరాత్రి ఉత్సవాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20వేలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టి యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, కర్ర రవీందర్ రడ్డి, పుల్ల ఎల్లగౌడ్, దేశబోయిన ఉపేందర్, ఏనుబోతుల దేవేందర్, శాస్త్రబోయిన యాకయ్య, మాలోత్ వసుందర్, సంధి దేవేందర్ రెడ్డి, ఐరెడ్డి వెంకన్న, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, పెండోట శివ, పట్నం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్ అనంతరం ఎంఎల్‌సిలతో గట్టిక అజయ్, యాకయ్య భేటి

**ప్రజాపక్షం/నెక్కొండ :** హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో నర్సంపేట నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం అనంతరం స్థానిక సంస్థల ఎంఎల్‌సి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్..నల్గొండ..ఖమ్మం ఎంఎల్‌సి అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని తెలంగాణ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు, నెక్కొండ మాజీ ఎంపిపి గట్టిక అజయ్‌కుమార్, డిఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటికి సంబంధించిన వివరాలను వారు వెల్లడించారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/నెక్కొండ :** పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.30వేలు చెల్లించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 26న నిర్వహించనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియూ) రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ చాగంటి వెంకటయ్య పిలుపునిచ్చారు. నెక్కొండ అంబేద్కర్ సెంటర్‌లో యూనియన్ మండల అధ్యక్షుడు బానోతు దేవేందర్ అధ్యక్షతన ఛలో హైదరాబాద్ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఆర్‌సి పరిధిలోకి తీసుకురావాలని, డిఏ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రూ.9500 వేతనంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అక్రమ తొలగింపులను అరికట్టి, అదనపు సిబ్బంది పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు సాయిలు, మదార్, కరుణాకర్, సూరమ్మ, యాకలక్ష్మి , బుజ్జమ్మ, లక్ష్మణ్, స్వామి, బిక్షపతి, పాల్గొన్నారు.

## క్రీడలతో నైపుణ్యత ఏర్పడుతుంది



**ప్రజాపక్షం/నిజాంపేట్:** క్రీడలతో, మానసిక ఉత్తేజం,శారీరక దృఢత్వం పెరుగుతుందని, చెడు వ్యసనాలను వదిలి యువత క్రీడలపై మొగ్గు చూపాలని,మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. నిజాంపేట మండలం నగరం తండా గ్రామంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ను శనివారం పాల్గొని ప్రారంభించారు. క్రీడలపై మొగ్గు చూపలని, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న యువతకు స్థానిక నాయకులను అభినందించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు భాను ప్రకాష్ రెడ్డి, గ్రామ సర్పంచ్ అంతంపల్లి సుశీల సురేష్, నస్కల్ ఎఫ్పిఓ చైర్మన్ నాతి లక్ష్మి గౌడ్, ఉప సర్పంచ్ నాజాం, చల్మెడ ఉపసర్పంచ్ మహేష్, మైనార్టీ మండల శాఖ అధ్యక్షులు సులేమాన్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో పచ్చదనం పరిశుభ్రతం



**ప్రజా పక్షం/ రేగోడు :** మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ లో ఆవరిలో ప్రతి నెల రోజులు ఒకసారి పచ్చదనం పరిశుభ్రతం కార్యక్రమం చేయాలని ఆదేశాలకు చేయడం జరిగిందని ఎస్సై పోచయ్య అన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయంలో ఘనంగా త్రీరాత్రోత్సవాలు



**ప్రజాపక్షం/కొమురవెల్లి :** శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో శరదృతు శ్రీ దేవీ తీరాత్రోత్సవాలు ఈరోజు ప్రారంభించారు. ముందుగా గంగా పూజ అగ్రోదకం గర్భాలయంలో స్వామి వారికి అర్చన క్షేత్రపాల భైరవారాధన నిర్వహించి, మహా గణపతి పూజ,శ్రీ గౌరీ పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, నాంది సమారాధన , దీక్షా కంకణ ధారణ, ఋత్విగ్వరన, అఖండదీప స్థాపన, అంకురార్పణ, ఆదిత్యాదినవగ్రహ దేవత స్థాపనం, ఇంద్రాది అష్ట దిక్పాలక దేవతా స్థాపనం, ప్రధాన కలశస్థాపన, దేవి ప్రాణప్రతిష్ట, చేసి అమ్మవారిని ఈరోజు మహా సరస్వతి రూపంలో చతుష్షష్టి ఉపచార మహా పూజ, అగ్ని ముఖ ప్రతిష్ట, మహాగణపతి హోమం, అనంతరం మహా మంగళ హారతి మహా మంత్ర పుష్ప సమర్పణ జరిగింది. అనంతరం పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

## మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించిన చిట్కుల

**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మనోహరాబాద్ మండలం కల్లకల్ గ్రామానికి చెందిన కరాటే మాస్టర్ నత్తి మల్లేష్ ముదిరాజ్ తల్లి నత్తి లక్ష్మి శనివారం మృతి చెందారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిట్కుల మహిపాల్ రెడ్డి కళ్ళకల్ గ్రామానికి వెళ్లారు. అక్కడ మల్లేష్ కుటుంబాన్ని కలిసి, వారిని ఓదార్చి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు నరేష్ ముదిరాజ్, ఎరుకల వెంకటేష్, కాళిదాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసం చేసింది...



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** అధికారంలోకి వచ్చేందుకు ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల నాగరాజు అన్నారు. బిజెవైఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తా వద్ద శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముచ్చర్ల నాగరాజు మాట్లాడుతూ నిరుద్యోగులకు రూ. 4 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా నేటికి ఆ ఊసే ఎత్తడం లేదని అన్నారు. విద్యార్థులకు మూడేళ్ల నుండి రూ. 14 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వికలాంగులకు, మహిళలకు, విద్యార్థులకు, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి జాతీయ నాయకులకు సేవ చేయడం, వేల కోట్లు ఎలా సంపాదించుకోవాలనే ఆలోచన లోనే ఉన్నాడని, ప్రజలను పట్టించుకునే సోయి లేకుండా పోయిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం నాయకులు సదానంద్‌గౌడ్, బబ్బూరి రవీందర్, మదుసూధన్, మణికంఠ, వివేక్, ప్రశాంత్, కళ్యాణ్‌దాస్, టోనీ, శ్రీకాంత్, శరత్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత తోనే మానసికప్రశాంతత



**ప్రజాపక్షం/శివ్వంపేట :** ఆద్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, శివ్వంపేట మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా అన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేట గ్రామంలోని ప్రముఖ పురాతన పుణ్యక్షేత్రమైన రామాలయానికి ధ్వజ స్థంభం ఏర్పాటుకు తన సొంత నిధుల నుంచి రూ. వేల విరాళాన్ని ఆలయ పూజారి శాస్త్రుల రాజశేఖర్‌శర్మకు అందజేశారు. అదేవిధంగా ధ్వజస్థంభ ప్రతిష్ఠ జరిగే రోజున భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా తాను సొంతంగా ఏర్పాటు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్, ఉపసర్పంచ్ మల్లేశం, వార్డుసభ్యులు ముత్యాలు, యాదగిరి, గ్రామశాఖ అద్యక్షులు లక్ష్మినర్సయ్య, మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు పోచాగౌడ్, మగ్దుంపూర్ సర్పంచ్ సోము అశోక్, పీఎంజీ యువసేన సభ్యులు కొత్తపేట శ్రీనివాస్‌గౌడ్, సోముసాని రేవంత్, పత్రాల త్రినేష్‌గౌడ్, కల్లూరి రాజు, బాలాపురం సురేష్, సాదక్, క్యాసాని వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## దసరా వేడుకల వేళ పారిశుద్ధ్య సిబ్బందికి వస్త్రాల పంపిణీ



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకుని మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కాళ్లకల్ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ఎస్‌పీ కాళిదాస్ 13వ వార్డు సభ్యురాలు సృజన దంపతులు శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ ప్రతి ఏటా దసరా పండుగ సందర్భంగా వారికి నూతన వస్త్రాలను అందజేస్తున్నట్లు కాళిదాస్ తెలిపారు. గత నాలుగేళ్లుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని, గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న సుమారు 20 మంది పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కాళిదాస్ కుటుంబ సభ్యులతో పాటు పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి గ్రామంలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామ సర్పంచ్ చింతల శ్రీనివాస్ యాదవ్ శనివారం ప్రారంభించారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో గ్రామంలోని మసీద్ గడ్డ నుండి బతుకమ్మ చెరువు వరకు 40 విద్యుత్ స్తంబాలను ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించినట్టు తెలిపారు. అలాగే గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీధి లైట్లను ప్రారంభించి ప్రజలు పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. పంచాయతీ కార్మికులకు నూతన దుస్తులతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. పంచాయతీ కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రూ. 10 లక్షల విలువైన పోస్టల్ హెల్త్ ఇన్స్యూరెన్స్ బాండ్లను కార్మికులకు అందజేశారు. గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కరించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సహకరించిన విద్యుత్ శాఖ డిఈ రామచంద్రయ్య, ఎడిఈ శ్రీనివాసులు,ఎఈ శ్రీధర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వాణి కిషన్, పంచాయితీ కార్యదర్శి కుమార్, లైన్మెన్ హరీష్, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ కనకమల్లయ్య,మాజీ సర్పంచ్ పయ్యావుల రాములు, జేపీ యాదవ్, సంతోష్, ఫయాజ్, కాంట్రాక్టర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాల ప్రాంగణాన్ని పరిశీలించిన ఇన్స్‌పెక్టర్ లక్ష్మిబాబు



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని రంగాధాంపల్లి హనుమాన్ దేవస్థాన పరిధిలో ప్రతి ఏటా దసరా ఉత్సవాలు అంగరంగా వైభవంగా జరుగుతాయి. దసరా రోజు రంగధాంపల్లిలో జరిగే రావణాసుర దహనాన్ని వీక్షించడానికి వేల సంఖ్యలో ప్రజలు తరలివస్తారు. ఉత్సవాలు జరిగే ప్రదేశాన్ని అక్కడి ఏర్పాట్లను శనివారం సిద్దిపేట త్రీటౌన్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీబాబు మూడవ వార్డు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఉత్సవాలు నిర్వహణ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ నుండి తగిన సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటి అధ్యక్షులు ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ తిరుమల్ రెడ్డి, ఐలయ్య యాదవ్, కనకయ్య, గిరియాదవ్, బానుచందర్, బాలరాజు, లింగం, దుర్గారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను కళ్ళకల్ గ్రామంలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. సద్దుల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. మహిళలు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా బతుకమ్మలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేసేందుకు వీలుగా గ్రామంలో ప్రత్యేకంగా ఘాట్‌ను నిర్మించారు. శనివారం సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్, ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్‌లు పాలకవర్గ సభ్యులతో కలిసి ఈ పనులన్నీ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పారిశుద్ధ కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్



**ప్రజాపక్షం/పాపన్నపేట :** మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ గత నాలుగు రోజుల నుండి భారతి సిమెంట్ ఆధ్వర్యంలో సుధా ట్రేడర్స్ పర్యవేక్షణలో క్రీడలు నిర్వహించారు. శనివారం పాపన్నపేట హైస్కూల్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ హోరాహోరి గా పోటీపడ్డారు. ఈ క్రీడల్లో మొదటి విజేతగా పోడ్చన్ పల్లి టీం, రెండవ విజేతగా పాపన్నపేట టీమ్ తృతీయ బహుమతి పోడ్చన్ పల్లి తండా టీం విజేతలుగా నిలిచారు. బహుమతుల బహుకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ పావని నరేందర్ గౌడ్, భారతి సిమెంట్ మేనేజ్మెంట్ నాగేశ్వరరావు, శ్రీధర్ సుధా ట్రేడర్స్ యజమాని మున్నూరు శంకరయ్య తో పాటు స్థానిక నాయకులతో కలిసి గెల పొందిన వారికి బహుమతులు అందజేశారు. ఓటమి గెలుపుకు నాంది అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు సుధాకర్, సంతోష్ తో పాటు పాపన్నపేటలోని పలు పార్టీల రాజకీయ నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వివిధ యువజన సంఘాల సభ్యులు.. క్రీడాకారులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ



**ప్రజాపక్షం/చేర్యాల :** దేశంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగ. మహిళలను గౌరవిస్తూ వారి ఔనత్యాన్ని చాటి చెప్పే సంస్కృతికి వేదిక మన తెలంగాణలో బతుకమ్మ పండుగ అని చేర్యాల కోర్టు న్యామూర్తి బానోత్ శ్రీరామ్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో బతుకమ్మ పండుగ సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. చేర్యాల కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో కోర్టులో పనిచేస్తున్న మహిళలు ఆట పాటులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్బంగా న్యామూర్తి బానోత్ శ్రీరామ్ మాట్లాడుతూ... రోజురోజుకు సమాజంలో సాంప్రదాయ బద్దంగా చేసుకునే పండుగల్లో పాశ్చాత్య సంస్కృతి జొప్పిస్తూ సాగుతున్న ఆట పాటలకు దూరంగా తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందన్నారు. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. మహాలయ ఆమవాస్యనుండి తొమ్మిది రోజుల ఆత్యంత భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పండుగను జరుపుకుంటారన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆంబరాన్ని అంటే సంబరం బతుకమ్మ పండుగ ఆని కొనియాడారు. తంగేడు, గునుగు, పట్టుకుచ్చుల, చామంతి, బంతిపూలతో పాటుగా తీరొక్క పూలతో బతకమ్మను పేర్చి పూల బతకమ్మను దేవుడిలా కొలుస్తు ఆరాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరేళ్ల వీర మల్లయ్య, జనరల్‌సెక్రటరీ మెరుగు రమేష్, సీనియర్ న్యావాదులు భూమిగారి మనోహర్, బూరుగు యాదగిరి గౌడ్, ఆరేళ్ల మహేందర్, తాటికొండ ప్రణీత్, నల్లగొండ సంతోష్ గూడెపు శ్రీధర్, దర్శనం ప్రశాంత్, అంజనేయులు, కోర్టు స్టాఫ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన అధికారులు

**ప్రజాపక్షం/కొండపాక** : కొండపాక మండలం లోని పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పంటల పరిస్థితిని పరిశీలించారు. వరి, పత్తి, కంది తదితర పంటల ఎదుగుదల స్థితిని, చీడపీడల ఉధృతిని పరిశీలించారు. వరి పంటలో కొన్ని ప్రాంతాల్లో బ్రౌన్ ప్లాంట్ హాపర్, పురుగు ఉనికిని గుర్తించి, దాని నివారణకు తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు చేశారు. పంటలో పురుగు ఉధృతిని క్రమం తప్పకుండా గమనించాలని, అవసరమైనప్పుడు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు తగిన నివారణ



చర్యలు చేపట్టాలని సూచించారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల సముదాయం ఉనికిని గుర్తించి, వాటి నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని రైతులకు వివరించారు. పురుగుల ఉధృతిని గమనిస్తూ, అవసరమైనప్పుడు సిఫార్సు చేసిన పురుగుమందులను సరైన మోతాదులో మాత్రమే వినియోగించాలని, పురుగుమందుల మిశ్రమాలను అనవసరంగా ఉపయోగించరాదని సూచించారు. అదే విధంగా, వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు పంటల్లో తేమ సంరక్షణ చర్యలు చేపట్టాలని, అవసరానికి అనుగుణంగా నీటి వినియోగాన్ని నియంత్రించాలని, కలుపు మొక్కలను నివారించాలని, నేలలో తేమను కాపాడే పద్ధతులను పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ పంటల్లో చీడపీడల లక్షణాలను గమనించిన వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి, వారి సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణ సూచించారు. ఆయన వెంట పలువురు వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.

## శ్రీ మహాలక్ష్మీ దేవి స్వరూపంలో మర్పడగ విజయదుర్గ



**ప్రజాపక్షం/కొండపాక** : కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఏడవ రోజు మహాలక్ష్మీ స్వరూపిణిగా విజయదుర్గ భక్తులకు దర్శనమిచ్చింది. క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులు వందలాదిగా పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసద వితరణ చేశారు.

## బతుకమ్మ పాటకు రాష్ట్రస్థాయి లో తృతీయ బహుమతి

**ప్రజాపక్షం/పాపన్నపేట:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ పాటల పోటీల్లో ఆరేపల్లి గ్రామానికి చెందిన దొడ్లే మనీషా పాటిల్ రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బతుకమ్మ పాటల పోటీల్లో ఆమె దర్శకత్వం వహించి, నటించిన బుజ్జి బతుకమ్మ పాటకు మూడో బహుమతి లభించింది. రాష్ట్రస్థాయిలో బుజ్జి బతుకమ్మ పాటకు గుర్తింపు లభించడంతో ఆరేపల్లి గ్రామంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రజిత రాజశేఖర్‌తో పాటు గ్రామ ప్రజలు మనీషా పాటిల్‌ను అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పాటకు గుర్తింపు తీసుకురావడం గర్వకారణమని పేర్కొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

**ప్రజాపక్షం/శివ్వంపేట** : మండల కేంద్రమైన శివ్వంపేటలో శనివారం పెద్ద ఎత్తున మహిళల బతుకమ్మ సంబురాలు నిర్వహించుకున్నారు. రకరకాల పూలతో ఆకృతుల్లో అలంకరించి వార్డువార్డులలో మహిళలు బతుకమ్మలు తీసుకువచ్చి తమదైన శైలిలో బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. గ్రామపురవీధుల గుండా పెద్దచెరువు కట్టపై గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన స్థలంలో బతుకమ్మలు ఉంచి పూజలు చేసి మహిళలు బతుకమ్మలు ఆడారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ఎస్సై మధుకర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఫుడ్ పాయిజన్ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

**ప్రజాపక్షం/నర్సాపూర్** : నర్సాపూర్ పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో నాలుగు రోజుల క్రితం బిర్యానీ తిని ఫుడ్ పాయిజన్‌కు గురైన బాధితులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీత రెడ్డి శనివారం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి బాధితులను పరామర్శించారు. బాధితులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మ్యాజిక్ ఆప్షన్ నెంబర్ మన్సూర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నయీముద్దీన్, నాయకులు సత్యం గౌడ్, షేక్ హుస్సేన్, సర్పంచ్ శివకుమార్, రింగుల ప్రసాద్, నాగరాజు గౌడ్ తదితరులు ఉన్నారు.



## పేదల సేవే ప్రధాని మోదీ లక్ష్యం - ఎంపీ రఘునందన్ రావు

**ప్రజాపక్షం/నర్సాపూర్** : పేద ప్రజలకు సేవ చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన లక్ష్యమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని సాయికృష్ణ కళ్యాణ మండపంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన దివ్యాంగుల పరికరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ రఘునందన్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి హాజరై దివ్యాంగులకు పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇటీవల జరిగిన కాస్కో క్రీడా పోటీల్లో భారత దివ్యాంగ క్రీడాకారులు 49 పతకాలు సాధించి దేశాన్ని నాలుగో స్థానంలో నిలిపారని గుర్తు చేశారు. దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. దివ్యాంగులను గుర్తించేందుకు ప్రాజెక్టు పరిధిలో కాకుండా మండల స్థాయిలోనే క్యాంపులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అర్హులైన దివ్యాంగులు ఎవరైనా మిగిలిపోతే ఆధార్ కార్డు, సర్టిఫికెట్లు తనకు అందజేస్తే పరికరాలు



మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సునీతా రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దివ్యాంగులకు విద్య, వైద్య రంగాలతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. దివ్యాంగులకు ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ సక్రమంగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజు యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, సీడీపీఓ హేమా భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం** : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మండలంలోని చిల్వర్ గ్రామంలో శనివారం సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో ఊరు బతుకమ్మలన్నీ ఒక్కచోట చేర్చి చుట్టూ సంప్రదాయ బద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ వేడుకల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు మహిళల్లో ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని పలువురు పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా గ్రామ సర్పంచ్ శశిధర్ రెడ్డి ఎలాంటి లోటు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పండుగ సందర్భంగా గ్రామ పెద్దలు చిన్నలు యువతి యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వైభవంగా నిర్వహించుకున్నారు. అనంతరం ఊరు దగ్గర్లో ఉన్న చెరువులో పోయి రావమ్మ మళ్ళీ రావమ్మా అంటూ పాటలు పాడుతూ బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

## లలితా త్రిపుర సుందరి దేవిగా (కాలరాత్రి) వన దుర్గమ్మ

**ప్రజాపక్షం/పాపన్నపేట** : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల క్షేత్రంలో దేవీశరన్నవ రాత్రుల మహోత్సవాలు వైభవోపేతంగా అంగరంగవైభవంగా దుర్గానామస్మరణలతో భక్తితన్మయంతో మారుమ్రోగుతున్నాయి. దేవీశరన్నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఏడవరోజైన శనివారం ఉత్సవ మండపంలో శ్రీలలితాత్రిపురసుందరీ దేవి కాళ్లరాత్రి దేవీ అమ్మవారు అలంకారంలో నారింజ పట్టువస్త్రంలో వనదుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన ఆలయంలో శ్రీలలితాత్రిపురసుందరీ దేవి అలంకారంలో వన దుర్గాభవాని అమ్మవారికి, గోకుల్ షెడ్ లోని ఉత్సవ మండపంలో శ్రీలలితాత్రిపురసుందరీ దేవి అలంకారంలో ఉన్న దుర్గాదేవి అమ్మవారికి వేద బ్రాహ్మణ పండితులు ఆర్ శంకర్ శర్మ, పార్థీవశర్మ, మురళీధర్ చారీ, రాజేశ్వర్ శర్మల ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయంలో అర్చకులు పార్థీవశర్మ, ఉత్సవ మండపంలో వేద పండితులు, ప్రధాన అర్చకులు శంకర్ శర్మ, మురళీధర్ చారీ, రాజేశ్వర్ శర్మ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన తదితరులు పూజలు చేశారు. రాష్ట్ర నలుమూలల నుండి భక్తుల పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు ను స్వీకరించారు. ఏడుపాయల్లో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలతో ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. ఏడుపాయల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ వీరేశం ఆధ్వర్యంలో సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రవికుమార్,తదితర సిబ్బంది చర్యలు తీసుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## కేంద్ర హోం సహాయ మంత్రిని కలిసిన నాయకులు



**ప్రజాపక్షం/నిజాం-పేట్:** కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ ను మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు కరీంనగర్ లో మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. పార్టీ ఎదుగుదల వివిధ అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ కార్యక్రమంలో తపస్సు నాయకులు దుబాష్ భాస్కర్, దేశెట్టి శేఖర్, పిట్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/కొండపాక** : అదుపు తప్పిన ద్విచక్ర వాహనం కింద పడడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కొండపాక మండలం మర్పడగ శివారులో చోటుచేసుకుంది. కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ షరీఫ్ (48) ఆర్టిఏ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా సిద్దిపేటకు వెళ్లి తిరిగి శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం పై ఇంటికి వస్తున్న క్రమంలో మర్పడగ శివారులో ఫారెస్ట్ సమీపాన అదుపుతప్పి కింద పడిపోయి మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టుగా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించి మృత దేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ అసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. షాహిన్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ సిఐ టి.లక్ష్మీ బాబు తెలిపారు.

## క్రీడలతో మానసిక ఉత్తేజం



**ప్రజాపక్షం/నిజాంపేట్** : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలని స్థానిక ఎస్సై రాజేష్ సూచించారు. నిజాంపేట మండలం నగరం తాండ గ్రామంలో నగరం ప్రీమియం క్రికెట్ లీగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల వల్ల మానసిక ఉత్తేజం, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. యువత చిరుధారిన పోకుండా మంచి మార్గంలో నడుస్తూ గ్రామాలకు ప్రజలకు మండలానికి మంచి పేరు తేతవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, ఎఫ్పీవో చైర్మన్ నాతిలక్ష్మా గౌడ్, అంతంపల్లి సురేష్, మాజీ ఎంపీపీ దేషెట్టి సిద్దరాములు, మైనార్టీ శాఖ మండల అధ్యక్షులు సులేమాన్, వార్డు సభ్యులు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉపాధి అధికారిపై సమాచార కమిషన్‌లో ఆప్పీలు

**ప్రజాపక్షం/సంగారెడ్డి** : సంగారెడ్డి మెడికల్ కాలేజ్ ,సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ఎంపిక నిబంధనలు , సంగారెడ్డి మెడికల్ కాలేజీ, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా ఉద్యోగుల భర్తీ కొరకు జారీ చేసే ఉద్యోగ ప్రకటనలు వాటి నకలు కాపీలు సమాచారం, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ఒప్పంద పత్రాలు కోరుతూ తేద 237 2026 నాడు సంగారెడ్డి పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్తల ఎం శ్రీదర్ జిల్లా ఉపాది కార్యాలయంలో సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయగా గడువు దాటినా ఏలాంటి సమాచారం ఇవ్వని సమాచార అధికారిపై మొదటి ఆప్పీలు చేయగా అసంపూర్తి సమాచారం హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయగా అసంపూర్తి సమాచారం ఇచ్చిన అధికారి నేడు 17102026 రోజు రాష్ట్ర సమాచార కమిషన్ లో రెండవ ఆప్పీలు దాఖలు చేసిన ఎం శ్రీదర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగారెడ్డి మెడికల్ కాలేజ్, ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో అదికారులు ఏజెన్సీలు నిబంధనలు పాటించడం లేదని ఉద్యోగ నియామకాల్లో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయని అందుకే సమాచారం ఇవ్వడానికి జిల్లా ఉపాది అధికారి కార్యాలయం అధికారులు గోప్యత పాటిస్తున్నారని అన్నారు.

# ఆపదలో ఉన్న కార్మిక కుటుంబానికి అండగా ఎమ్మెల్యే జి.ఎం.ఆర్

ప్రజాపక్షం/పటాన్‌చెరు : పొట్టకూటి కోసం సొంత రాష్ట్రాన్ని ఆత్మీయులను విడిచి వచ్చి పటాన్చెరులో కార్మికుడిగా జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. కుటుంబ పెద్దను కోల్పోయిన విషాదంలో ఒకవైపు కన్నీరు మున్నీరవుతుండగా ,మరోవైపు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా ఆర్థిక స్తోమత లేక ఆ కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. ఈ విషాద సమయంలో విషయం తెలుసుకున్న పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మానవత్వంతో స్పందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. అంత్యక్రియలు నిమిత్తం తన సొంత నిధుల నుంచి రూ. 75 వేల ఆర్థిక సాయం అందించి మానవీయతను చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే బెంగాల్ రాష్ట్రంలోని 24 పరగణాల జిల్లాలకు చెందిన అమల్ ప్రమాణ్, గత కొంతకాలంగా తన కుటుంబంతో కలిసి పటాన్చెరు ప్రాంతంలోని స్థానిక పరిశ్రమలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.



రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో శ్రమిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయన శుక్రవారం రాత్రి అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కుటుంబ పెద్దను కోల్పోయిన దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని స్వరాష్ట్రానికి తరలించడం అంత్యక్రియలు నిర్వహించడం మరింత భారంగా మారింది. కనీసం చివరిసారిగా తమ ఆత్మీయుడికి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించాలన్న కుటుంబ సభ్యుల ఆకాంక్షకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుగా నిలిచాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి తన సొంత నిధుల నుంచి రూ. 75 వేల ఆర్థిక సహాయం అందించారు . కష్టకాలంలో ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు భవిష్యత్తులోను అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మినీ ఇండియాగా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలో వివిధ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు. వారి సంక్షేమం భద్రత ఆపద సమయంలోసహాయం అందించడం పట్ల తాము బాధ్యతతో వ్యవహరిస్తామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/భూపాలపల్లి: జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం, బీసీ యునైటెడ్ ఫ్రంట్ సముద్రాల తిరుపతి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాటి కంటి రవికుమార్ లు డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు శనివారం వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్ హెచ్ ఎన్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న 5 శాతం వేతన పెంపు, 8 శాతం వార్షిక వేతన పెంపును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 180 రోజుల ప్రసూతి సెలవులు, ఈహెచ్ఎస్/ఈఎస్ఐ సౌకర్యాలు, ప్రమాద బీమా కల్పించాలని, పెండింగ్ వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు బీసీ సంఘాలు మద్దతు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారగోని ఎల్ల స్వామి గౌడ్, ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

## నేరాలు తగ్గుముఖం పట్టడానికి సమిష్టిగా కృషి చేయాలి

ప్రజాపక్షం/భూపాలపల్లి: జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టడానికి అన్ని శాఖల అధిపతులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే.జీవన్ కుమార్ శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కేసుల్లోని బాధితులకు అందుతున్నటువంటి నష్టపరిహారం గురించి అధికారులను అడిగి వారు తెలుసుకున్నారు. జైల్లో ఉన్నటువంటి నిందితుల వివరాలను, వారి స్థితిగతులను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి తాడూరి మహతి వైష్ణవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ ఆర్ దిలీప్ కుమార్ నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, అడిషనల్ ఎస్.పి.ఏ నరేష్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్, మునిసిపల్ కమిషనర్ ఉదయ్ కుమర్, డిఎస్‌పి లు సంపత్ రావు, సూర్యనారాయణ, ఫారెస్ట్ అధికారి అప్పలకొండ, ఎస్సైలు సిఐలు పాల్గొన్నారు.

## సంస్కృతీ సంప్రదాయాలను అందించడంలో పండుగలదే కీలక పాత్ర

ప్రజాపక్షం/సంగారెడ్డి : భావి తరాలకు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయడంలో పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ సంప్రదాయబద్ధంగా ,ఆనందోత్సాహాలతో ఘనం జరుపుకోవాలని ఆయన కోరారు. సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పట్టణాభివృద్ధి సంస్థ పట్టణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి పండుగలను సామూహికంగా జరుపుకోవడం ద్వారా మన సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు అందుతాయని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు, మహిళలు



రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సంప్రదాయ బద్ధంగా ఆడిపాడారు. సంప్రదాయబద్ధంగా పండుగను సామూహికంగా జరుపుకోవడంతో కలెక్టరేట్‌లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులతో పాటు కలెక్టరేట్ సమీప కాలనీలకు చెందిన మహిళలు చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిద్దిపేట వైద్యుడికి జాతీయ స్థాయి గుర్తింపు

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సత్య నర్సింగ్ హోమ్ వైద్యుడు డాక్టర్ అశోక్ కుమార్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ది ఇండస్ట్రీ ఇన్‌సైట్స్ (TII) మ్యాగజైన్ ప్రచురించిన '2026లో భారతదేశంలోని ప్రముఖ 10 మంది గైనకాలజిస్టులు' ప్రత్యేక సంచికలో ఆయనకు చోటు దక్కింది. దీంతో సిద్దిపేట వైద్యరంగానికి గౌరవం లభించినట్లయింది. 1996 నుంచి సత్య నర్సింగ్ హోమ్ ద్వారా ఆయన సిద్దిపేట ప్రాంత ప్రజలకు వైద్యసేవలందిస్తున్నారు. మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తూ, హై రిస్క్ డెలివరీ కేసులు ఆధునిక లాపరోస్కోపిక్ వైద్య విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పేద రోగులకు ఫీజుల తగ్గింపు, మినహాయింపు వంటి సాయాన్ని అందిస్తూ మానవతా దృక్పథాన్ని చాటుతున్నారు. సిద్దిపేట ఆబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ (సాగ్స్ ) అధ్యక్షుడిగా ఇతర వైద్యులకు ఆధునిక వైద్య పరిజ్ఞానాన్ని పంచేందుకు కృషి చేస్తున్నారు. వైద్యవృత్తిలో నిమగ్నమై ఉంటూనే సంగీతంపై ఆసక్తితో సుమారు 6,000 పాటలను రికార్డు చేయడం ఆయన ప్రత్యేకత. దాదాపు మూడు దశాబ్దాలుగా స్థానిక ప్రజలకు సేవలందిస్తున్న వైద్యుడికి జాతీయ స్థాయి మ్యాగజైన్‌లో గుర్తింపు లభించడంపై ఆస్పత్రి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవి, హాస్పిటల్ సిబ్బంది వేణుగోపాల చారి, గిరి, మల్లేశం, మురళి, హాస్పిటల్ సిస్టర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ గణనతో సమయం ఆదా కచ్చితమైన జనాభా వివరాల సేకరణ



ప్రజాపక్షం/సంగారెడ్డి : జనాభా గణనలో స్వీయ గణన ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి సమయాన్ని ఆదా చేయడంతో పాటు కచ్చితమైన నాణ్యమైన సమాచారాన్ని సేకరించాలని తెలంగాణ రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతీ హోలీ కేరి సూచించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశమందిరంలో చార్జ్ క్లర్కులు ,సాంకేతిక సహాయకులకు జనాబా గణన రెండో దశ పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని జనాబా గణన నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భారతీ హోలీ కేరి మాట్లాడుతూ జనాభా గణన మొదటి దశలో గృహాల జాబితా తయారీ గృహాల వివరాలు ,కుటుంబ సభ్యుల సంఖ్యకు సంబంధించిన సమాచారాన్ని సేకరించినట్లు తెలిపారు. రెండో దశలో ప్రతి వ్యక్తికి సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్వీయ గణనకు ప్రత్యేక ప్రాధాన్యత నిస్తూ కుటుంబంలోని సభ్యులందరి వివరాలను సంబంధిత యాప్‌లో ముందుగానే నమోదు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్వీయ గణన పూర్తియిన అనంతరం ఎన్యూమరేటర్లు సంబంధిత కుటుంబాలను సందర్శించి నమోదు చేసిన వివరాలను పరిశీలించాలని , అవసరమైన చోట సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈవిధానం ద్వారా ఎన్యూమరేటర్ల పని భారం తగ్గడంతో పాటు ప్రజల సమయం కూడా ఆదా అవుతుందని వివరించారు. జిల్లా జనాభాను దృష్టిలో ఉంచుకొని నిర్ణీత సమయంలో స్వీయ గణన లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది ,ఆశాకార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు ,ఇతర శాఖల సిబ్బంది సహకారంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.

**క్షేత్ర స్థాయి పరిశీలనతో వివరాల ఖచ్చితత్వం**

గతంలో నిర్వహించిన హౌస్‌లిస్టింగ్ ఆపరేషన్ సేకరించిన వివరాలను ఆధారంగా తీసుకొని ప్రస్తుత క్షేత్ర స్థాయి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆమె సూచించారు. జనాభా పెరుగుదల కొత్త నిర్మాణాలు ,వలసలు, గుర్తింపుకు నోచుకొని నివాసాలు, సంస్థాగత గృహాలు కూళీ గృహాలు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత వివరాలను నిర్దేశిత ప్రొఫార్మాల్లో నమోదు చేయాలని తెలిపారు. ఇళ్లు లేని వ్యక్తులతో సహా అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు జనాబా గణనలోనమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జనాబా గణనలో ఏలాంటి పొరపాట్లకు తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ సీపీఓ గీత చార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులు ,మాస్టర్ ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంలోనూ ముందుండాలి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు సామాజిక సేవ, ప్రజలకు మెరుగైన సేవ లందించడం, ఆరోగ్యం లోను ముందుండటం అభినందనీయమని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన వరంగల్ ట్రై సిటీ హాఫ్ మారథాన్‌లో టీజీ ఎన్‌పీడీసీఎల్‌కు చెందిన సుమారు 130 మంది ఉద్యోగులు పాల్గొనగా సీఎండీ వారిని ఉత్సాహపరిచి ఆరోగ్య పరిరక్షణ, శారీరక దృఢత్వం ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా హన్మకొండ నక్కలగుట్ట లోని ప్రధాన కార్యాలయంలో సీఎండీ మాట్లాడుతూ విధి నిర్వహణతో పాటు సామాజిక సేవా బాధ్యతలను నిర్వర్తించడంలో ప్రజలకు అన్ని విధాలా సేవలందించడంలో ఫిట్‌నెస్‌లోనూ తమ ఉద్యోగులు ముందుండటం గర్వకారణమని పేర్కొన్నారు.టీజీ ఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలందించడం, అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించడం వంటి విధుల్లో నిరంతరం నిమగ్నమై ఉంటారని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సామాజిక సేవల్లో భాగంగా టీజీ ఎన్‌పీడీసీఎల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నెలకు 27 స్వచ్ఛంద సంస్థలకు రూపాయలు ఐదు లక్షల నలభై వేయిలు ఆర్థిక సహాయం అందించడం వారి దాతృత్వానికి చిహ్నం అన్నారు. పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా వ్యాయామం, నడక వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన ఉద్యోగులే మరింత ఉత్సాహంతో, అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలందించగలరని అన్నారు.విద్యుత్ సేవలతో పాటు ప్రజాసేవ, సామాజిక బాధ్యత, ఆరోగ్య పరిరక్షణ వంటి అన్ని రంగాల్లోనూ టీజీఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని సీఎండీ పేర్కొన్నారు.

## ఎస్ఐకి సర్పంచ్‌ల సత్కారం



ప్రజాపక్షం/నెక్కొండః నెక్కొండ మండలానికి నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్ఐ జె ప్రవీణ్ కుమార్‌ను శనివారం మండల సర్పంచ్‌ల బృందం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు భూక్య రమేష్‌తో పాటు నక్కలగుట్ట తండా సర్పంచ్ డాక్టర్ బానోత్ రవీందర్ నాయక్, నెక్కొండ తండా సర్పంచ్ బానోత్ రవికుమార్, పిట్టకాలబోడు సర్పంచ్ సూర్యభాయ్, వెంకటాపురం సర్పంచ్ కవిత అఖిల్, అలంకానిపేట సర్పంచ్ నిరోషా శ్రవణ్, మడిపల్లి సర్పంచ్ అనూష వినోద్, లోక్‌నాయక్ సాయిరెడ్డిపల్లి సర్పంచ్ బంధారుపల్లి వినయ్ కుమార్ శ్రీనివాస్, చెరువుముందరి తండా సర్పంచ్ కున్సోత్ మంగమ్మ శ్రీనివాస్, చిన్నకోర్కపోలు సర్పంచ్ అనిత భద్రు, తొపనపల్లి సర్పంచ్ మమత తిరుమల్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ



ప్రజాపక్షం/భూపాలపల్లి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, విశిష్ట జీవన విధానానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రకృతిని, పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. ఆడపడుచులందరూ ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ పండుగ ప్రతి ఇంటా సంతోషం, ఆయురారోగ్యాలు, సిరిసంపదలను నింపాలని కోరారు. చెరువులు, ఘాట్ల వద్ద బతుకమ్మ నిమజ్జన కార్యక్రమాలను ప్రజలందరూ అప్రమత్తంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ సంబరాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు.